క్లుప్తంగా

బంకుల తొలగింపు



క్లాక్‌టవర్ సమీపంలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న బంకులను క్రేన్ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక క్లాక్‌టవర్ వద్ద గవిమఠం స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న బంకుల తొలగింపునకు శనివారం అధికారులు చర్యలు తీసుకున్నారు. గతంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం గవిమఠం స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. సదరు స్థలంలో అక్రమంగా బంకులు ఏర్పాటు చేసి సబ్ లీజుకు ఇవ్వడంతో గవిమఠం ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. బంకులను వెంటనే తొలగించాలని లీజుదారుడికి నోటీసులు జారీ చేశారు. పంచాయతీ నుంచి కూడా బంకులు ఏర్పాటు చేసుకోవడానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని ఉరవకొండ మేజర్ పంచాయతీ ఈఓ. గౌస్‌సాహెబ్ వెల్లడించారు. శనివారం భారీ క్రేన్‌ల సహాయంతో బంకులను తొలగించారు. కార్యక్రమంలో ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది, ఎస్‌ఐ జనార్దన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



లక్ష్మీనృసింహుడిని ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ: పెన్నహోబిలంలో శనివారం శ్రీవారి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు సుప్రభాత సేవలు, మహామంగళహారతి, కుంకుమార్చన, దీక్షాహోమం నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి శ్రీవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. పల్లకీలో కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు గ్యాస్ సిలిండర్ అమ్మితే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ లక్ష్మీదేవి

కూడేరు: గ్యాస్ సిలిండర్‌ను రూ.869.50 పైసలు కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే ఏజెన్సీ రద్దు చేస్తామని సీఎస్‌డీటీ లక్ష్మీదేవి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కొంత మంది గ్యాస్ వినియోగదారులకు సీఎస్‌డీటీ స్వయంగా ఫోన్ చేశారు. గ్యాస్ సిలిండర్ ఎంతకు విక్రయిస్తున్నారని ఆరా తీశారు. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో ఎర్రెమ్మ పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలని కూలీల నిరసన

కుందుర్పి: ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని వివిధ గ్రామాలకు చెందిన కూలీలు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 40 రోజులుగా ఉపాధి పనులు చేపట్టిన కనీసం రూపాయి బిల్లు అందలేదన్నారు. హార్టికల్చర్ పథకం కింద పండ్ల తోటల రైతులకు అభివృద్ధి నిధులు అందక పండ్లమొక్కలు ఎండిపోతున్నట్లు రైతులు గురుస్వామి, నరసింహులు, హనుమప్ప, రాజు తదితరులు తెలిపారు. స్పందించిన ఎంపీడీఓ లక్ష్మీశంకర్ మాట్లాడుతూ ఈనెలాఖరులోగా ఉపాధిహామీ కూలీలకు బిల్లులు అందుతాయన్నారు.

దుకాణంలో చోరీ



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి

కణేకల్లు: కణేకల్లులోని కోడివంక సర్కిల్ వద్ద నున్న నబీషా జనరల్ స్టోర్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు కిరాణాదుకాణం పైకప్పు ఎక్కి రేకులషీట్‌ను ఐరన్ కట్టర్ బ్లేడ్‌తో కత్తిరించి లోనికి చొరబడ్డారు. క్యాష్ డ్రాలో ఉన్న కాయిన్స్, 10, 20 రూపాయల నోట్లను తీసుకొన్నారు. వీటి విలువ రూ.13వేల వరకు ఉంటుందని షాపు యజమాని పెద్దదేవర నబీషా తెలిపారు. అలాగే సుమారు రూ.30 వేలు విలువ చేసే సిగరెట్ బండిల్స్, కిరాణా సరుకులను ఎత్తుకెళ్లారు. దొంగలు సీసీ కెమెరా హార్డ్‌డిస్క్ వెంట తీసుకెళ్లారు. ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి, పోలీసులు కిరాణా దుకాణాన్ని సందర్శించి చోరీపై ఆరా తీశారు.

ఆపరేషాన్





రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

- మత్తు వైద్యుడు లేక అవస్థలు
- ఇద్దరుండాల్సిన చోట ఒక్కరు కూడా లేరు
- రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలకు ఇబ్బందులు

రాయదుర్గం: ఏ శస్త్ర చికిత్స చేయాలన్నా మత్తు వైద్యుడి పాత్ర కీలకం. శరీరంలోని ఆయా భాగాల్లో మత్తును ఇచ్చాకే శస్త్ర చికిత్స ప్రారంభిస్తారు. ఇంతటి కీలకపాత్ర పోషించే అనస్తీషియన్లు లేక రాయదుర్గం వంద పడకల ఆసుపత్రిలో ప్రసవాలు, ఇతర శస్త్ర చికిత్సలకు ఇబ్బందిగా మారుతోంది. ప్రసవాలకు పేరుగాంచిన రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో సాధారణ కాన్పులతో పాటు శస్త్ర చికిత్సలు చేస్తుంటారు. ప్రతి నెల కనీసం 50 నుంచి 60 కు తగ్గకుండా ప్రసవాలు చేస్తే అందులో 80 శాతం ఆపరేషన్లే ఉంటున్నాయి. ఇంత ఆదరణ ఉన్న ఆసుపత్రిలో ఒక్క మత్తు వైద్యుడు కూడా లేకపోవడం గమనార్హం. దీంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మిగులుతుంది. అత్యవసర సేవలు దూరమవుతున్నాయి. తక్షణం మత్తు వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఒక నెలలో 250 ప్రసవాలు జరిగిన రికార్డు జిల్లా సరిహద్దులోని రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి సొంతం. సీహెచ్‌సీ నుంచి ఏరియా ఆస్పత్రిగా గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్‌గ్రేడ్ తర్వాత అధునాతన సౌకర్యాలతో కూడిన శస్త్ర చికిత్సలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తెచ్చారు. తద్వారా సుఖ ప్రసవాలతో పాటు అత్యవసర ప్రమాద బాధితులకు బాసటగా నిలిచారు. అయితే ఆ స్థాయిలో కాకున్నా, వచ్చిన వారందరికీ సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది ప్రస్తుతం కృషి చేస్తున్నారు. ముగ్గురు గైనిక్ వైద్యులకుగాను ఇద్దరే ఉన్నారు. మత్తు వైద్యుల (అనస్తీషియా) పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో పక్క నియోజకవర్గాలకు చెందిన వైద్యులే దిక్కవుతున్నారు. గతంలో అనస్తీషియా, ఆర్థోకు ఇద్దరు సీనియర్ వైద్యులు ఉండేవారు. అనుకున్న సమయానికే శస్త్ర చికిత్సలు పూర్తి చేసేవారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక జరిగిన సాధారణ బదిలీల్లో వారు వెళ్లిపోయారు. దీంతో శస్త్ర చికిత్సలకు ఇబ్బందులు తలెత్తాయి. గత ఆరు నెలలుగా రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో 287 సాధరణ కాన్పులు జరగగా, సుమారు 120 వరకు చిన్న చిన్న శస్త్ర చికిత్సలు జరిగాయి. ప్రధానంగా మత్తు, ఆర్థో వైద్యులు లేక మేజర్ శస్త్ర చికిత్సలన్నీ బళ్లారి, అనంతపురానికి రెఫర్ చేయాల్సి వస్తోంది. ఇన్‌చార్జులతో కొన్ని చేయిస్తున్నా ఖాళీలు శాశ్వతంగా భర్తీచేస్తేనే ప్రయోజనం.

ఆస్పత్రిలో కాన్పుల వివరాలు ఇలా..

నెల	కాన్పుల సంఖ్య
సెప్టెంబర్	62
అక్టోబర్	60
నవంబర్	68
డిసెంబర్	54
జనవరి	43
మొత్తం	287

ఉన్నతాధికారులకు నివేదించాం



మత్తు వైద్యులను కేటాయించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం పక్క నియోజకవర్గాలకు చెందిన వైద్యులను రప్పిస్తున్నాం. ఇబ్బందులను ఉన్నతాధికారులు గుర్తించారు. త్వరలో ఒకర్ని నియమించే అవకాశం ఉంది.

మెర్సీ జ్ఞానసుధ, మెడికల్ సూపరింటెండెంట్, రాయదుర్గం

సమస్య పరిష్కరిస్తాం

రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో త్వరలో మత్తు వైద్యుడి పోస్టు భర్తీ చేస్తాం. ప్రస్తుతం ఇద్దరు వైద్యులకు ఇన్‌చార్జు బాధ్యతలు అప్పగించాం. శాశ్వత వైద్యుడి కోసం ప్రయత్నిస్తున్నాం. మరో వారం రోజుల్లోనే సమస్యకు పరిష్కారం చూపిస్తాం.

– డాక్టర్ పాల్‌రవికుమార్, డీసీహెచ్‌ఎస్, అనంతపురం

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బ్రహ్మసముద్రం : నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని గోపాల్‌రెడ్డి తోటలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న తన పాలనలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళదామన్నారు. ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం, కార్మిక సంఘం నాయకులు పాతలింగప్ప, సంజీవ, మాజీ ఎంపీపీ మహదేవప్ప, మండల మాజీ కన్వీనర్ చన్నమల్లప్ప, ఎంపీటీసీ బసప్ప, రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు లోకేష్ , ఎర్రిస్వామి, జిన్నామల్లి, నజీర్, మండల యూత్ కన్వీనర్ రాము, వేపులపర్తి మంజు, రామకృష్ణ, మల్లేష్, చెలిమేపల్లి ఆంజనేయులు, అయ్యన్న , శివన్న, ధనుంజయ, మంజు, రాము, శంకర్‌నాయక్, కార్యకర్తలు తదితరులు పల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ ఆలోచన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే ఇటీవల పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థినుల బృందం, గైడ్ టీచర్ శైలజ ఆధ్వర్యంలో తిరువనంతపురంలో జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్లు, మెడల్స్ సాధించారు. దీన్ని పురస్కరించుకుని శనివారం విద్యార్థినులకు అభినంద సభ ఏర్పాటు చేశారు. ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్ హాజరై విద్యార్థులను అభినందించారు. స్కౌట్‌లో పాల్గొన్న పిల్లలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి ప్రోత్సహించారు. హెచ్‌ఎం జయప్రద, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం



బొమ్మనహాళ్‌లో సరస్వతి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



రాయదుర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతీపూజ నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: స్థానిక జూనియర్ కళాశాలలో శనివారం 24వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సరస్వతీదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిట్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. రెండు సంవత్సరాలుగా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో బొమ్మనహాళ్ జూనియర్ కళాశాల ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమన్నారు. ఈ ఏడాది కూడా జిల్లాలో మొదటి స్థానం దక్కించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు మల్లికార్జున, వీరన్న, అధ్యాపకులు సుబ్బరాయుడు, హనుమంతనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి పూజ

రాయదుర్గంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సరస్వతీ పూజ నిర్వహించారు. ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులపై దాడి దుర్మార్గం

కూడేరు: మండల పరిధిలోని కడదరకుంటలో భూ వివాదంలో శనివారం దళిత మహిళలపై టీడీపీ జెడ్పీటీసీ అశ్విని భర్త తుప్పటి హరీష్, మామ తుప్పటి ఈశ్వరయ్య దాడి చేసి గాయపరచడం దారుణమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ధ్వజమెత్తారు. దళితులపై దాడి చేసిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మి, రమాదేవి, రమేష్, పోలప్ప తదితరులను పరామర్శించినట్లు ఆయన తెలిపారు.

అల్లా మార్గం అనుసరణీయం



ఆధ్మాత్మిక ప్రసంగం చేస్తున్న ముఫ్తీ నిజాముద్దీన్

కణేకల్లు: అల్లామార్గం అనుసరణీయమని బెంగళూరుకు చెందిన ఆధ్మాత్మిక బోధకుడు ముఫ్తీ నిజాముద్దీన్ సూచించారు. కణేకల్లులోని దిగువవీధిలో నూతనంగా నిర్మించిన మస్జిద్-ఏ- అక్సా ప్రారంభోత్సవం శనివారం నిర్వహించారు. ఉదయం ఫజర్ నమాజ్‌తో మస్జిద్ ప్రారంభమైంది. ప్రారంభోత్సవానికి రాయదుర్గం, మల్కాల్మూరు, కళ్యాణదుర్గం, వైఎస్ఎస్ కోట, కంబదూరు తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు తరలివచ్చారు. ఈసందర్భంగా ముఫ్తీ నిజాముద్దీన్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరికి మంచి మాత్రమే చేయాలని చెడు ఎన్నటికీ చేయరాదన్నదే అల్లాహ్ ఆజ్ఞ అన్నారు. సంపాదనలో పేదలకు సాయం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ ఉపవాసం ఉండి అల్లాహ్ కృపకు పాత్రులు కావాలన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

బొమ్మనహాళ్: రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రెండో రోజు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ, కాపు, కమ్మ కులాలకు సంబంధించి మండలానికి 47 యూనిట్లు మంజూరు కాగా మొత్తం 322 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి రోజు 212 మంది హాజరయ్యారు. రెండో రోజు 110 మంది హాజరు కావాల్సి ఉండగా 61 మంది హాజరైనట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ గ్రామీణ బ్యాంకు, కర్ణాటక బ్యాంకు, కెనరా బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించి దరఖాస్తుదారుల అర్హత పత్రాలను పరిశీలించారు.

అంధురాలి పింఛన్ నిలిపివేతకు కుట్ర



అంధురాలు బసమ్మ

గుమ్మఘట్ట: అంధురాలి పింఛన్ నిలిపివేతకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. వివరాలు.. మండలంలోని కలుగోడు గ్రామానికి చెందిన బసమ్మ అంధురాలు. గత ఇరవై ఏళ్లుగా పింఛన్ అందుకుంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్‌దారుల ఏరివేతకు తెరలేపింది. బసమ్మకు వచ్చే నెల నుంచి పింఛన్ ఇచ్చేది లేదని గ్రామసచివాలయ సిబ్బంది సూచించారు. ఎందుకు నిలిపి వేస్తున్నారని ప్రశ్నించగా.. ఆధార్ కార్డు డెడ్ అయిందని, వేలిముద్రలు పడడం లేదని, ఐరీస్ సరిపోవడం లేదని చెబుతున్నారు. దీంతో అంధురాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. ఈ విలషయంపై ఎంపీడీఓ రామకృష్ణను వివరణ కోరగా వృద్ధురాలి ఆధార్ అప్‌డేట్ చేసి, వచ్చే నెలలో పింఛన్ అందజేస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

వజ్రకరూరు: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ నవీన్ తెలిపారు. శనివారం మండలంలోని రాగులపాడు, పీసీ.ప్యాపిలి తదితర గ్రామాల్లో పర్యటించారు. రాగులపాడు గ్రామంలో రైతు షెక్షావలి పొలంలో పీఎండీఎస్ (ప్రీమాన్‌సూన్‌డ్రైసోయింగ్) విత్తనాలు నాటారు. పీఎండీఎస్ పంటలతో నేలకు భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ మాస్టర్ ట్రినర్ ధనుంజయ, వజ్రకరూరు మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: ఏపీ ఆదర్శ(మోడల్) పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాయదుర్గం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 లను ఆన్‌లైన్ ద్వారా రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20న జరిగే ప్రవేశ పరీక్ష అనంతరం ప్రతిభ, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం జిల్లా అధికారులు సీట్లు భర్తీ చేస్తారన్నారు. వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు.

26 నుంచి వీరభద్రస్వామి వేడుకలు

వజ్రకరూరు: మండల పరిధిలోని తట్రకల్లు గ్రామంలో ఈనెల 26వ తేదీ నుంచి భద్రకాళిసమేత వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకుడు రాఘవేంద్ర స్వామి, ఉపసహాయ అర్చకుడు మల్లికార్జున స్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

రాయదుర్గం కోర్టు తనిఖీ



మురడి ఆంజనేయస్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న ఎస్సీ, ఎస్టీ జిల్లా స్పెషల్ కోర్టు, అదనపు జడ్జి సాధుబాబు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఎస్సీ, ఎస్టీ జిల్లా స్పెషల్ కోర్టు, జిల్లా అదనపు జడ్జి బి.సాధుబాబు శనివారం తనిఖీ చేశారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రమ్యతో కలిసి కోర్టు రికార్డుల వార్షిక తనిఖీ చేశారు. అనంతరం జడ్జిని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో జిల్లా అదనపు జడ్జి మొక్కలు నాటారు. అనంతరం ఆయన రాయదుర్గం పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం, జంబుకేశ్వరస్వామి ఆలయం, దశభుజ గణపతి ఆలయం, మురడిలోని ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ జయానాయక్, రూరల్ సీఐ వెంకటరమణ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై అవగాహన



ఇంటింటా చెత్త సేకరిస్తున్న దృశ్యం

కూడేరు: వృథాగా పడేసే తడి, పొడి చెత్త నుంచి సంపద సృష్టించవచ్చని ఎంపీడీఓ కుల్లాయి స్వామి తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో అధికారులు పర్యటించారు. క్లాప్ మిత్రలతో కలిసి ఇంటింటా చెత్త సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మికంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయిస్తామని తెలిపారు. వచ్చే ఆదాయాన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు జరుగుతుందని వెల్లడించారు. ప్రజలు చెత్తను డస్ట్‌బిన్‌లో వేసి పెడితే పారిశుధ్య కార్మికులు వచ్చి తీసుకెళ్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాధాకృష్ణ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు సన్మానం



వెంకటేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణపురం వెంకటేష్‌ను శనివారం ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కలసికట్టుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేద్దామన్నారు. తనకు అవకాశం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు వెంకటేశులు, నరసింహులు, గాజుల తిమ్మశెట్టి, చిన్నమల్లి, గాజుల ప్రభాకర్, రామాంజనేయులు, హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

'వాటర్‌షెడ్'పై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: గోళ్ల గ్రామంలో శనివారం ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వాటర్‌షెడ్ పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాటర్‌షెడ్ పథకం ఉద్దేశాలు, నేల, నీరు, వృక్ష సంపదను సక్రమంగా వినియోగించడం ఎలా అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వలంటీర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీధర్‌ను డ్వామా పీడి సలీం బాషా అభినందించారు.

సంక్షిప్త సమాచారం

భక్తులకు సౌకర్యాలు కల్పించాలని వినతి



గవిమఠం సహాయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం సందర్భంగా భక్తులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలని తాలుకా వీరశైవ సంఘం నాయకులు కోరారు. శనివారం గవిమఠం సహయ కమిషనర్ రాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్ర, తెలంగాణతో పాటు కర్ణాటక నుంచి గవిమఠం రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున వస్తారని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, భోజన వసతి కల్పించాలన్నారు. భక్తులకు హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని సూచించారు. వీరశైవ సంఘం నాయకులు పాటిల్ నిరంజన్ గౌడ్, పాటిల్ నాగన్న, బొజ్జప్ప, దేశాయ్ వీరేష్, చంద్ర, వెలిగొండ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

రాయదుర్గం: మండలంలోని 74 ఉడేగోళం వద్ద 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా రాయదుర్గం పట్టణంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు కరెంట్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ బాలచంద్ర తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాలుగో రోజు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు కొనసాగాయి. సర్పంచు మోనాలిసా మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ విద్యా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎర్రిస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎంఈఓ ఎర్రిస్వామి, హెచ్‌ఎం రంగప్రసాద్, రిసోర్స్‌పర్సన్స్ ఇమాం సాబ్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అక్షరాలు నేర్పించాలి

బొమ్మనహాళ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో అక్షరాలు నేర్పించాలని ఎంఈఓ మల్లికార్జున, ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలు పొందాలంటే యూనిక్ ఐడీ తప్పనిసరి

కుందుర్పి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు పొందాలంటే యూనిక్ ఐడీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ యల్లప్ప పేర్కొన్నారు. శనివారం ఏడీఏ పర్యవేక్షణలో ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ, రాయితీలు, పంటలబీమా తదితర పథకాలు రైతు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు(ఫార్మర్ రిజిస్ట్రీ)తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, రేషన్ కార్డు నకళ్లను ఆయా గ్రామాల ఆర్‌బీకేల్లో అందిస్తే సిబ్బంది యూనిక్ ఐడీ నమోదు చేస్తారన్నారు.